వంగ సాగు.. లాభాలు బాగు

- పుంజుకున్న వంగ ధరలు
- హర్షం వ్యక్తం చేస్తున్న వంగ సాగు చేసిన రైతులు


చిన్నమండెం మండలంలో సాగైన వంగ తోట


వంకాయలను సంచులకు వేస్తున్న రైతులు

చిన్నమండెం : జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో టమాటా, పూలతోటల సాగుతో నష్టపోయిన రైతులను.. ప్రస్తుతం వంగ సాగు ఆదుకుంటోంది. రైతుల ఇంట సిరులు కురిపిస్తోంది. జిల్లాలో ఈ సీజన్‌లో 2650 హెక్టార్లలో వంగ తోటలు సాగు చేపట్టారు. ఎకరానికి దుక్కుల నుంచి కాయలు కోతకు వచ్చే వరకు పెట్టుబడి రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షల వరకు వస్తుంది. మొక్కలు నాటిన 90 రోజులకు కాయలు కాయడం మొదలవుతుంది. సుమారు 3 నెలల పాటు కాయల కోత ఉంటుంది.

ఎకరానికి రూ.4.80 లక్షల వరకు ఆదాయం

ఇటీవల కురిసిన వర్షాలకు టమాటా, పూలతోటలు దెబ్బతినడంతో రైతులు టమాటా కాకుండా ఇతర పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపతున్నారు. ప్రస్తుతం వంగకు మంచి ధరలు పలుకుతుండటం విశేషం. ప్రస్తుతం వంగ పంట ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మార్కెట్లో మొదటి రకం కిలో రూ.40, రెండో రకం కిలో రూ.32, మూడో రకం కిలో రూ.25 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈ లెక్కన ఎకరానికి రూ.4 లక్షల నుంచి రూ.4.80 లక్షల వరకు ఆదాయం వస్తోంది. 15 రోజులుగా ఇవే ధరలు నిలకడగా ఉండటంతో.. రైతులు ఇప్పుడిప్పుడే లాభాల బాట పడుతున్నారు.

నాలుగు నెలల తరువాత..

దాదాపు 4 నెలల తరువాత మార్కెట్లో వంగ ధరలు పుంజుకొన్నాయి. అంతకు ముందు ధరలు పతనమవడంతో పలువురు రైతులు తోటలు దున్నేశారు. ప్రస్తుతం ఓ వైపు దిగుబడి లేకపోవడం.. మరోవైపు వర్షాలకు పంటలు దెబ్బతినడంతో వంగ ధరలు పెరిగాయి. తమిళనాడులో పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఎక్కువగా మన జిల్లా వంగ ఎగుమతి చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో వంగ తోటలు అంతంత మాత్రంగానే ఉండటంతో మన జిల్లా నుంచి ఎగుమతి అవుతున్నాయి.

ఆదాయం వచ్చింది



నాకు ఉన్న 2 ఎకరాల పొలంలో వంగ పంట సాగు చేశా. ధరలు బాగా పలకడంతో మంచి ఆదాయం పొందుతున్నాను. ప్రస్తుతం మార్కెట్లో వీటి ధరలు బాగా ఉన్నాయి. ధరలు ఇలాగే ఉంటే రైతుల కష్టాలు తీరుతాయి.

- కుమార్, రైతు, కొత్తపల్లి, చిన్నమండెం మండలం

అప్పుల బాధలు తీరేలా..



వంగ ధరలు మార్కెట్లో పెరుగుతుండటంతో తాము తీసుకున్న అప్పులు తీరేలా కనిపిస్తున్నాయి. వంగ పంటకు మంచి ధరలు పలకడం శుభ సూచికంగా కనిపిస్తోంది. ధరలు ఇలాగే ఇంకొన్ని రోజులు ఉండేలా కనిపిస్తుంది. ప్రస్తుతం కార్తీక మాసం రైతులకు కలిసొచ్చే అవకాశం.

- పి.రామలక్ష్మమ్మ, మల్లూరు గ్రామం, చిన్నమండెం మండలం

విద్యార్థి అదృశ్యం


కొప్పల సూర్య

రాజంపేట : కడప పట్టణంలోని నారాయణ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న కొప్పల సూర్య కనిపించడం లేదని తల్లిదండ్రులు లక్ష్మీదేవి, రమణలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలివార్ పల్లి గ్రామానికి చెందిన ఈ దంపతులు తమ కుమారుడు కనిపించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యార్థి ఆచూకీ తెలిసిన వెంటనే పట్టణ సీఐ 9121100569, రాజంపేట ఎస్ఐ 9121100570, 9121100571 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సిద్దవటం : మండలంలోని జంగాలపల్లె గ్రామ పంచాయతీ పరిధి వెలుగుపల్లె గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ వెలుగుపల్లె గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడులు చేసి సుబ్బరాయుడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని, 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హోమాలు


పురవీధులలో ఊరేగుతున్న మూలమూర్తులు

పుల్లంపేట : మండల పరిధిలోని కోనెయ్యగారిపల్లి గ్రామంలో మంగళవారం శ్రీ సీతారామ లక్ష్మణ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం పురవీధులలో ఊరేగించారు. నేడు బుధవారం విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని, తదుపరి అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, ఆలయ ధర్మకర్త నారంరెడ్డి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ నాగా పిచ్చిరెడ్డి, ఆలయ కమిటీ మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వీడ్కోలు


బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ విజయారావును సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఓబులవారిపల్లె : ఇటీవల బదిలీపై పెనగలూరుకు వెళ్లిన ఎంపీడీఓ విజయారావుకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ప్రస్తుత ఎంపీడీఓ మల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, 22 పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు ఆయనకు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీటీసీ వత్తలూరు రోహిణి కుమార్ రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి గతంలో ఎంపీడీఓగా విజయారావు తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకేసుల రఫీ, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ చెన్నయ్య

సిద్దవటం : మండలంలోని గృహ నిర్మాణాల లబ్ధిదారులు తమ గృహాలకు ఇచ్చిన సమయం అయిపోయిందని, మీరు వెంటనే గృహనిర్మాణాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ చెన్నయ్య తెలిపారు. మండలంలోని మాధవరం-1 గ్రామంలోని గృహ నిర్మాణాల లబ్ధిదారుల పనులును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపడుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని తెలియజేశారు.

మాతాశిశు సంరక్షణే ధ్యేయం


కార్యక్రమం అనంతరం తల్లులతో సీడీపీఓ రాజేశ్వరి

చిట్వేలి : అంగన్‌వాడీ వర్కర్లు ఉద్యోగాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం చిట్వేలి ప్రాజెక్టు పరిధిలో 144 కేంద్రాలలో ఈసీసీఈ (బాల్య సంరక్షణ, విద్య) డే సంబరాలను ఘనంగా నిర్వహించారు. కెకె వడ్డిపల్లి కాలనీలో జరిగిన సంబరాలలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించి వారి శారీరక, మానసిక, భావోద్వేగ భాషాభివృద్ధిల గురించి తల్లులకు వివరించడమే కాకుండా ఆటపాటలు ద్వారా విద్యను బోధించే విధానాన్ని చూపించారు. మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న ఐసీడీఎస్ పనిలో పూర్వ ప్రాథమిక విద్య అనేది అత్యంత కీలకమన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు ఉద్యోగాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించి పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్లు వసుందరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖరాణి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

సుండుపల్లె : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 7వ తేదీ గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


ఎస్.రాజంపేటలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

సిద్దవటం : వరిలో సస్యరక్షణ చర్యలు రైతులకు సకాలంలో చేపట్టాలని మండల వ్యవసాయాధికారి (ఏఓ) రమేష్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని వంతాటిపల్లె, ఎస్.రాజంపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు మొదట క్షేత్ర సందర్శనలో వరి పంటను పరిశీలించి, తదుపరి గ్రామ సభను నిర్వహించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ వరిలో ఉత్తమ యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించామన్నారు. వేరుశనగలో విశిష్ట రకాన్ని రబీలో నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15లోపు సాగు చేసుకోవాలన్నారు. అలాగే చౌడు భూముల యాజమాన్యం, సాగునీటి పరీక్ష ప్రాధాన్యత వివరించామన్నారు. రబీ సీజన్‌లో వరి రకమైన 15048 ఎక్కువగా సాగుచేయడం జరుగుతుందని ప్రతి ఒక్క రైతు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఒక లీటరు నీటికి 2 గ్రాముల కార్బన్డిజం లేదా 8 గ్రాముల సుడోమోనాస్ మందుతో విత్తన శుద్ధి చేయాలని సూచించారు. వరిలో ఆకుముడత, పచ్చదోమ, ఆకునల్లి, తెగుళ్లకు నివారణ చర్యలను రైతులకు వివరించామన్నారు. యూరియా వినియోగాన్ని తగ్గించి, పొటాష్ ఎరువులను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు ప్రేమ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి అన్ని విధాల కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్‌రెడ్డి

ఓబులవారిపల్లె : మండల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని ఎంపీపీ చీర్ల నాగమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ నాగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు రాకుండా అన్ని విధాల కృషి చేస్తామన్నారు. ఎంపీపీ మల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌రావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పి.లక్ష్మీనరసయ్య, వైస్ ఎంపీపీ గూడూరు గౌరీశంకర్‌రాజు, సర్పంచ్‌లు సుంకేసుల రఫీ, జరుగు నారాయణరెడ్డి, ఈశ్వరయ్య, ఎంపీటీసీలు వత్తలూరు రోహిణీకుమార్ రెడ్డి, అమృతాల విజయ్ కుమార్, దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విజృంభిస్తున్న విష జ్వరాలు


మాట్లాడుతున్న దార్ల రాజశేఖర్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని గ్రామాలలో ప్రజలు విషజ్వరాలు విజృంభిస్తున్న ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ మంగళవారం విమర్శించారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యం కుంటుపడి ప్రజలు జ్వరాలు, సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. కూలీ చేసుకునే పేదలు జ్వరాల బారిన పడటంతో పనులకు వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో కురిసిన వర్షాల వలన మురికినీరు నిలబడి దోమలు అధికమై పిల్లల నుండి పెద్దలు వరకు అనేక రకాల జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరోగ్యశాఖ, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, వెంటనే ప్రభుత్వం గ్రామాలలో ప్రతి కుటుంబాన్ని పరిశీలించి వారికి వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి పెంచలయ్య, మొగిలి విజయ్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అపార్'ను సద్వినియోగం చేసుకోవాలి


ఆధార్‌ను అప్‌డేట్ చేసుకుంటున్న విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లి : అపార్ ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజాపరిషత్ ఏఓ గురుప్రసాద్ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతోపాటు రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓలతో కలిసి ఆధార్ అప్‌డేట్ సెంటర్ ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రెడ్డయ్యలు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఆధార్ అప్‌డేట్ పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు అదనపు ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలనే సూచనలు మేరకు స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మరో సెంటర్‌ను రెండు రోజులపాటు ఏర్పాటు చేసే విధంగా చొరవ చూపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చక్రనాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్పులు, చేర్పులకు అవకాశం

పుల్లంపేట : మండలంలోని ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు సంబంధించి ఆయా ప్రాథమిక పాఠశాలలోని ప్రధానోపాధ్యాయున్ని సంప్రదించాలని ఎంఈఓ నాగా తిరుమలరావు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రాయచోటికి వన్నెతేవాలి

రాయచోటి టౌన్ : రాయచోటి అంటేనే ఒక చరిత్ర అలాంటి రాయచోటికి మరింత వెన్నెతేవాలని వీఆర్‌డీఎస్ అధ్యక్షులు సురేంద్రారెడ్డి సినీనటుడు కిరణ్ అబ్బవరంను కోరారు. మంగళవారం 'క' సినిమా సక్సెస్ మీట్‌లో భాగంగా కిరణ్ అబ్బవరం రాయచోటికి వచ్చారు. ఈ సందర్భంగా సురేంద్రారెడ్డి ఆయన్ను సన్మానించారు. మాట్లాడుతూ సినీ రంగం అంటే వారసులకే చెందిందని అలాంటి సినీ రంగంలో తన కంటూ గుర్తింపును తెచ్చుకొని విజయాలబాటలో ముందుకెళ్తూ రాయచోటి ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకొచ్చారని చెప్పారు. ఇలాగే మరిన్ని సినిమాలు తీస్తూ మరింత పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.

స్పోర్ట్స్ కోటా పెంపుపై హర్షం

రాయచోటి అర్బన్ : విద్య, ఉద్యోగాల రిజర్వేషన్‌లో స్పోర్ట్స్ కోటాను పెంచడంపై జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం రాజు హైస్కూల్ మైదానంలో హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇడగొట్టు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

నివాళి

వీరబల్లి : తాటిగుంటపల్లి పంచాయతీ సర్పంచ్ సాదు గోపినాథ్ రెడ్డి తండ్రి సాదు ప్రభాకర్‌రెడ్డి (80) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. దీంతో స్థానిక మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, మోడం నాగభూషణం, రామాంజనేయులు రెడ్డి, సర్పంచ్‌లు ఆంజనేయులు, నాగార్జునాచారి, మాజీ సర్పంచ్‌లు తిమ్మారెడ్డి, లక్ష్మయ్య, రామచంద్రారెడ్డి తదితరులు మృతదేహానికి నివాళి అర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యంను యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు విన్నవించారు. జిల్లా విద్యాశాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సుబ్రమణ్యంను మంగళవారం యూటీఎఫ్ నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల గ్రాంటులను వెంటనే పాఠశాలల పీఎఫ్ఎంఎస్ ఖాతాలకు జమ చేయాలన్నారు. 2023 టెన్త్ పరీక్షల మూల్యాంకన నిధులను వెంటనే ఉపాధ్యాయులకు చెల్లించాలన్నారు. 2024 ఆంగ్లం, ఫిజిక్స్, బయాలజీ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన నిధులు అందించాలన్నారు. జిల్లాలో పని సర్దుబాటు ప్రక్రియ వలన జరిగిన అసంబద్ధాలను సవరించాలంటూ కోరారు. 2022-24 టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులు, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయాలంటూ కోరారు. అనంతరం ఈ మేరకు డీఈఓకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు చంద్రశేఖ్, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వెంకటరమణ, శివారెడ్డి, సురేంద్రారెడ్డి, వెంకటయ్య, చిన్నరెడ్డెప్ప, లక్ష్మీరమణ, రాజు, నాగార్జున, శశికిరణ్, నరసింహారెడ్డి, అమీన్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మద్దిరేవుల, ఈడిగపల్లి సచివాలయాల్లో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ప్రజల నుంచి భూ సమస్యలు ఉన్నవారి నుండి అర్జీలను రెవెన్యూ సిబ్బంది స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాలలో రీసర్వేలో ఉత్పన్నమైన తప్పులను, జాయింట్ నెంబర్లను, మీ భూమి దగ్గరికి రెవెన్యూ సిబ్బంది సర్వేయర్‌తో కలిసి వచ్చి మీ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. గ్రామసభను రెండు రోజులు నిర్వహిస్తామన్నారు. సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ మాట్లాడుతూ చాలా రోజుల నుంచి పరిష్కారం కానీ భూ సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరించి ప్రజలకు, రైతులకు న్యాయం చేయాలని ఆమె తహసీల్దార్‌ను కోరారు. గ్రామంలో అందుబాటులో లేనటువంటి ప్రజలు బుధవారం అర్జీలు సమర్పించవచ్చని ఆర్ఐ రాజేష్ తెలియజేశారు. మండల సర్వేయర్ మదన్‌మోహన్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ గిరిబాబు, గ్రామ సర్వేయర్లు వేణు, ఓంప్రకాష్‌రెడ్డి, మారుతీ, వినయ్, గౌరీ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఇసుక రీచ్‌లు


నారాయణ నెల్లూరు వద్ద నదిలో కొట్టుకుపోయిన రీచ్ వద్ద వేసిన రోడ్డు

పెనగలూరు : పెనగలూరు మండలానికి రెండు ఇసుక రీచ్‌లు మంజూరు కాగా ఇటీవల రెండు ఇసుక రీచ్‌లను ప్రారంభించారు. ప్రారంభించిన కొద్దిరోజులకే చెయ్యేరు నదిలోకి నీరు చేరడంతో రెండు రోజుల నుంచి ఇసుక రీచ్‌లు నిలిచిపోయాయి. చెయ్యేరు నదిలో రీచ్‌ల వద్దకు వేసిన రోడ్డు నదిలో నీరు పారడంతో కొట్టుకుపోయింది. దీంతో ఇసుకను బయటకు తరలించేందుకు అవకాశం లేకుండా పోయింది. కోమంతరాజుపురం, నారాయణ నెల్లూరు రెండు రీచ్‌లలో ఇసుక నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. ట్రాక్టర్లతో ఇసుకను నది నుంచి తీసుకువెళ్లేందుకు కూడా నీరు పారుతుండటంతో అవకాశాలు సన్నగిల్లాయి. మరొక ప్రాంతం నుంచి ఇసుకను తరలించుకుందామనుకున్నా కొన్ని గ్రామాలలో రోడ్డు సమస్యలు ఉండటంతో ఇసుకను తరలించే యజమానులు, గృహాలు కట్టుకున్నే లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. రెండు రోజులు రెండు రీచ్‌లలో ఇసుకను తీసుకువెళ్లేందుకు వీలు లేకుండా పోవడంతో ట్రాక్టర్లన్నీ ఓబిలి మీదుగా టంగుటూరు వద్ద చెయ్యేరు నదిలో ఇసుకను తరలించేందుకు క్యూ కట్టాయి. టంగుటూరు రీచ్ యజమానులు ట్రాక్టర్ల వద్దనుంచి ముక్కుపిండి రూ. 800 నుంచి రూ. 1000లు వరకు వసూలు చేశారు. రోడ్డు వేసేందుకు ఖర్చులకుగాను రూ. 400లు, ఇసుకను లోడు చేసేందుకు రూ. 400లు ఇవ్వాల్సిందేనని చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి మరి వసూలు చేస్తున్నారు.

వైభవంగా నాగుల చవితి వేడుకలు


సిద్దవటం: నాగుల కట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


నందలూరు: పుట్టవద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు


రాజంపేట టౌన్: పుట్ట వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు


రాజంపేట రూరల్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి దంపతులు


రాయచోటి టౌన్: నాగ దేవతలకు పూజలు నిర్వహిస్తున్న వీరభద్ర స్వామి ఆలయ అర్చకులు


చిట్వేలి: శివాలయంలో నాగుల విగ్రహాలకు, పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

కార్తీక మాసంలో వచ్చే చవితి రోజుకు ఎంతో విశిష్ట ఉంటుంది. మంగళవారం దీనిని పురస్కరించుకుని అన్ని మండలాల్లో మహిళలు పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు వేకువజాము నుంచే పుణ్య స్నానాలు ఆచరించి ఉపవాసాలు ఉండి సమీపంలోని ఆలయాలు, పుట్టల వద్దకు చేరుకుని పూలు, పసుపు, కుంకుమలు సమర్పించి పుట్టకు పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో నాగుల చవితి వేడుకల సందడి స్పష్టంగా కనిపించింది. అనంతరం ఆయా ఆలయాల వద్ద దేవత మూర్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

– సాక్షి, నెట్‌వర్క్

సోమశిల ముంపు గ్రామాల పరిశీలన


పొలాల్లోకి చేరిన సోమశిల వెనుక జలాలను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ అధికారులు

ఒంటిమిట్ట : మండలంలో సోమశిల వెనుకజలాలకు సంబంధించి సరిహద్దు ప్రాంతాలను మంగళవారం సోమశిల జలాశయ ఎస్ఈ బీవీ రమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాలలో ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా సోమశిల జలాశయంలో 78శాతం నీటి మట్టాన్ని నిల్వచేస్తే ఎంతవరకు ముంపునకు గురవుతాయో అంచనా వేసేందుకు పరిశీలనకు వచ్చామన్నారు. ఈ పర్యటనలో తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామస్తులు తమ గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించాలని ఆయనను వేడుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం సోమశిల జలాశయంలో 70.2 టీఎంసీల నీటిమట్టం నిల్వ ఉందని, అయితే 78 టీఎంసీలు నిల్వఉంచితే ఎలాంటి సమస్యలు ఎదురవుతాయనే దానిపై అధ్యాయనానికి వచ్చామన్నారు. అయితే ఈ ఏడాది జలాశయంలో 73 నుండి 74 టీఎంసీల వరకు నీటిమట్టం నిల్వ ఉంచాలని చూస్తున్నామన్నారు. అలాగే సోమశిల వెనుకజలాలు గ్రామాలలోకి రాకుండా రక్షణ గోడ నిర్మించాలనుకుంటే ఇక్కడ డ్రైనేజీ నీరు వచ్చి చేరే అవకాశం ఉందని, గ్రామ ప్రజలు, రైతులు తెలిపిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఎంవీ రమణారెడ్డి, డీఈ డి.శ్రీనివాస కుమార్, ఏఈ పి.శివప్రసాద్, గ్రామ పెద్దలు ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, సర్పంచ్ దయ్యాల దిబ్బయ్య, గజ్జల శ్రీనివాసులురెడ్డి, మీసేవ సుబ్బారెడ్డి, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం వారు ఒంటిమిట్ట కోదండ రాముడిని దర్శించుకున్నారు.

పొదుపును అలవాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ గంగాదేవి

సిద్దవటం : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు పొదుపును అలవాటు చేసుకోవాలని సిద్దవటం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ గంగాదేవి తెలిపారు. సిద్దవటం మండలంలోని మూలపల్లె గ్రామంలో బ్యాంకు వారు మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో వివిధ డిపాజిట్ అయిన ప్రగతి త్రివేణి, ప్రగతి కుబేర డిపాజిట్‌ల పథకాల గురించి వివరించామన్నారు. కళాకారులు బ్యాంకులో గల వివిధ రకాల స్కీమ్‌ల గురించి పాటల రూపంలో ప్రజలకు తెలియజేశారు. అందరూ పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పాలసీలు తీసుకోవాలని పేర్కొన్నారు.